క్లుప్తంగా

నేడు అన్నమయ్య జయంతి ఉత్సవాలు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో అన్నమయ్య 615వ జయంతిని నిర్వహించనున్నట్లు కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. స్థానిక కళాకారులచే అన్నమయ్య సంకీర్తన గానం, లక్కరాజు కనకదుర్గచే అన్నమయ్య విశిష్టతపై ప్రసంగం, ఏప్రిల్ 30న నిర్వహించిన అన్నమయ్య పాటల పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రధానం చేస్తామని ఆయన వివరించారు. వీరితో సంస్థ సభ్యుడు లక్కరాజు లక్ష్మణరావు ఉన్నారు.

మేకలు, కోళ్ల అపహరణ

తెనాలిరూరల్: పెదరావూరులో మేక పోతులు, కోడి పుంజులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసుల కథనం మేరకు.. పెదరావూరుకు చెందిన షేక్ కరిముల్లాకు పెదరావూరు నుంచి బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కూచిపూడి వెళ్లే మార్గంలో పశువుల దొడ్డి ఉంది. ఇందులో మేకలు, కోళ్లను పెంచుతున్నాడు, శుక్రవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు 13 మేక పోతులు, మూడు కోడి పుంజులను అపహరించుకెళ్లారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.

ఎన్టీఆర్ జీవితంపై చర్చాగోష్ఠి



తెనాలిరూరల్: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ సినిమాలు, రాజకీయ జీవితంపై శనివారం రాత్రి చర్చా గోష్ఠి నిర్వహించారు. సూరపనేని అనురాధ, ఫజల్‌ఖాన్ ప్రజల పక్షాన నిలచిన ఎన్టీఆర్ సినిమాలు అన్న అంశంపై ప్రసంగించారు. వెస్టన్ డాన్స్ మాస్టర్ గుండిమెడ ఫణీంద్రను సత్కరించారు. అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



తెనాలిటౌన్: కఠెవరం గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆత్మానంద సేవా సమాజం ఆధ్వర్యంలో విశేష పూజలు, ఊరేగింపు నిర్వహించారు. కళాకారులైన పూసపాటి శ్రీనివాసరాజు, లక్కంరాజు వెంకమ్మరాజు, సిరివెళ్ళ సాంబ శివరాజును శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంపల శివ నాగేశ్వరరావు, కాశిరాజు వెంకటేశ్వరరాజు, భూమరాజు, వెంకంరాజు, మాజీ ఎంపీటీసీ కె.సాంబ శివరాజు, మాలకొండం రాజు, తదితరులు పాల్గొన్నారు. సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు.

మొహమ్మద్ రఫీకి ఏఎన్‌యూ డాక్టరేట్



తెనాలి: పట్టణానికి చెందిన షేక్ మొహమ్మద్ రఫీకి ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఇష్యూస్ అండ్ చాలెంజర్స్ ఆఫ్ మైగ్రెంట్ లేబర్ ది కంపారిటివ్ అనాలసిస్ ఆఫ్ ప్రీ అండ్ పోస్ట్ కోవిడ్ సినారియో ఇన్ ది స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై డాక్టర్ నాగరాజు బట్టు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలనందుకున్న వీరి పరిశోధన వ్యాసానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్టుగా రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలియజేశారు.

8 నుంచి సమ్మర్ క్యాంప్



కొల్లిపర: ఈ నెల 8 నుంచి జూన్ 11వ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కొల్లిపర శాఖ గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు సూచించారు. సమ్మర్ క్యాంప్ పోస్టర్లను స్థానిక గ్రామపెద్దలతో కలసి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంప్ జరుగుతుందని చెప్పారు. ఈ క్యాంప్‌లో విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్ర లేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్ తదితర వాటిపై గ్రంథాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో కొలకపురి నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు శనివారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. పోటీలను గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి.. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సిరిసిరి మువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి 'దారుణం' నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన, దర్శకత్వం పి.శివరామ్ వహించారు. పోటీలను కొలకపురి నాటక కళా పరిషత్ నిర్వాహకులు గోపరాజు విజయ్ పర్యవేక్షించారు. లోన్ యాప్ ద్వారా అప్పులు తీసుకున్న కుటుంబం ఆర్థిక ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడం.. ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు కళాకారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షుడు గొప్పరాజు రమణ అధ్యక్షత వహించారు. సభలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, షేక్ జానీ బాషా, తదితరులు మాట్లాడారు. గుంటూరు వేముల ఆర్ట్ థియేటర్ ద్వారా ప్రదర్శించి సూత్రం నాటికను ప్రదర్శించారు. ఈ నాటికకు రచయిత చిలువూరు నాగేశ్వరరావు వ్యవహరించగా వేముల మోహనరావు దర్శకత్వం వహించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సర్పంచ్ ప్రీతి



దారుణం నాటికలో ఓ సన్నివేశం

డాక్టర్ సుందర రామయ్యకు ఘన నివాళి

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.సుందరరామయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసు రోడ్డులోని శాఖ కార్యాలయంలో శనివారం పలువురు వైద్యులు డాక్టర్ సుందర రామయ్య సేవలను స్మరించుకున్నారు. సభలో విజయవాడకు చెందిన ప్రముఖ రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెలిచేటి సందీప్ 'బేసిక్స్ అండ్ క్లినికల్ అప్లికేషన్స్ ఆఫ్ ఎంఆర్ఐ విత్ రీసెంట్ అడ్వాన్సెస్' అన్న అంశంపై స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ సందీప్‌కు ఐఎంఏ సభ్యులు డాక్టర్ సుందర రామయ్య స్మారక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబ శివుడు, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ మాధవిలత తదితర వైద్యులు, డాక్టర్ సుందరరామయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



డాక్టర్ సందీప్‌కు బంగారు పతకం ప్రదానం

నేడు మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ

తెనాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెనాలికి చెందిన ప్రముఖ రాజకీయవేత్త కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆదివారం పట్టణంలో ఆవిష్కరించనున్నారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఉదయం 7 గంటలకు ఆవిష్కరించనున్నారు. దేవస్థాన సత్రం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కుటుంబ సభ్యులు ప్రతిష్టాపన మండపాన్ని నిర్మించగా, ప్రముఖ వ్యాపారవేత్త నంబూరు వెంకట కృష్ణమూర్తి, కుటుంబ సభ్యులు కాంస్య విగ్రహాన్ని తయారు చేయించారు. రోశయ్య కుటుంబ సభ్యులు, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో విగ్రహావిష్కరణ జరుగుతుందని దేవస్థానం పాలకవర్గ కమిటీ తెలిపింది. ఏడు దశాబ్దాల సుదీర్ఘకాలం తనదైన శైలిలో రాజకీయాల్లో కొనసాగిన రోశయ్య వివిధ మంత్రిత్వశాఖలను నిర్వహించటమే కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా బాధ్యతలను నిర్వర్తించిన విషయం తెలిసిందే. ఆయన స్మారకార్థం ఏర్పాటుచేసిన కాంస్య విగ్రహావిష్కరణలో పట్టణ ప్రజలు పాల్గొని నివాళులర్పించాలని కోరారు.



కొణిజేటి రోశయ్య (ఫైల్)

ముందంజలో 'ఉపాధి' ఉండాలి



కొల్లిపర: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కొల్లిపర మండలాన్ని జిల్లాలోనే ముందంజలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చివలూరు గ్రామంలో జరుగతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని సూచించారు. పని కల్పించటం లేదు అని తెలిస్తే సంబంధిత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ ఉత్తీర్ణత

తెనాలి: తెనాలి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించారని ఎంఈఓ డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ తెలిపారు. తెనాలి పట్టణం, మండలం, కొల్లిపర మండలం నుంచి మొత్తం 1,798 విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 1,365 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తెనాలి కొత్తపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, అత్తోట జెడ్పీ హైస్కూలు, తూములూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 580కి పైగా మార్కులు సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్నుంచి పరీక్షకు హాజరైన 1365 మంది విద్యార్థుల్లో 801 మంది ఉత్తీర్ణులయ్యారు. కొత్తపేట మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాల 98.8 శాతం ఉత్తీర్ణతను సాధించగా, ఖాజీపేట జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 80.6 శాతం, గంగానమ్మపేట టీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు73.8 శాతం, అయితానగర్ ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు 73.5 శాతం ఉత్తీర్ణతను సాధించారు.అంగలకుదురు హైస్కూలు 58.9 శాతం, కొలకలూరు హైస్కూలు 54.1, పెదరావూరు హైస్కూలు 48.5, సంగం జాగర్లమూడి హైస్కూలు 61.7, నందివెలుగు హైస్కూలు 50, కఠెవరం హైస్కూలు 53.7, బుర్రిపాలెం హైస్కూలు 63.6 శాతం ఉత్తీర్ణతను సాధించగా, చెంచుపేట కేఎస్ఎం స్కూలు 40.3 శాతం, కొత్తపేట బాలుర హైస్కూలు 56.8, ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలు 50.6 శాతం ఉత్తీర్ణతను సాధించింది. పినపాడు ఎయిడెడ్ పాఠశాల 23.5 శాతం, టీజే హైస్కూలుకు 22.2 శాతం ఉత్తీర్ణత లభించింది. కొల్లిపర మండలం నుంచి 433 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 323 మంది ఉత్తీర్ణులైనట్టు ఎంఈఓ లక్ష్మీనారాయణ వివరించారు.

ఉత్తమ ఫలితాలు..

తెనాలిటౌన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రూరల్ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కొలకలూరులోని జూబిలీ స్కూల్ విద్యార్థులు 92శాతం ఉత్తీర్ణులయ్యారు. 37మంది పరీక్షకు హాజరుకాగా 34మంది ఉత్తీర్ణత సాధించారు. ఖాజీపేటలోని జెడ్పీ 80శాతం, కొలకలూరులోని జెడ్పీ 54శాతం, కఠెవరంలోని జెడ్పీ 53.6శాతం, నందివెలుగులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50శాతం ఉత్తీర్ణత సాధించారు.

కొల్లిపరలో 75శాతం ఉత్తీర్ణత

కొల్లిపర: కొల్లిపర మండలంలో పదో తరగతి పరీక్షకు 433 మంది విద్యార్థులు హాజరు కాగా, 323 మంది ఉత్తీర్ణత సాధించారు. 75శాతం ఉత్తీర్ణత నమోదయ్యిందని ఎంఈఓ ఎం.లక్ష్మీనారయణ శనివారం తెలిపారు. మండలంలో ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. అత్తోట, తూములూరు, కొల్లిపర జెడ్పీ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధికశాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. మండలస్థాయిలో ఉత్తమ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాలికోన్నత..ఉత్తమ ఉతీర్ణత

తెనాలి: పదో తరగతి పరీక్షల్లో స్థానిక దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలను సాధించారు. 141 మంది విద్యార్థునులు పరీక్షకు హాజరుకాగా, 128 మంది ఉత్తీర్ణులై.. 91 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రధానోపాధ్యాయిని వి.శాంతకుమారి తెలియజేశారు. ఇదే పాఠశాలకు విద్యార్థులు పలువురు 500కు పైగా మార్కులు సాధించారు. వీరిని మొవ్వా సత్యనారాయణ అభినందించారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

తెనాలిరూరల్: పట్టణం, మండలంలోని పాఠశాలల్లో 'నాడు నేడు' పథకం కింద జరుగుతున్న పనులను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. మండలంలోని సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూలు, తెనాలి కొత్తపేటలోని తాలూకా హైస్కూలులో పనులను పరిశీలించారు. అనంతరం ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తాలూకా హైస్కూలులో జరిగిన 'నాడు-నేడు' అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. వేసవి సెలవులు ముగిసే లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, ఇంటినారిగ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ జాలాది రవి, డీఈ రవీంద్ర, సైట్ ఇంజినీర్ నరేంద్ర, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ విజయలక్ష్మి

నేడు ఆహా గేమ్స్ అండ్ ఫన్ ఫ్యామిలీషో

తెనాలి: ది తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి ఆంధ్రాప్యారిస్ ఆహా గేమ్స్ అండ్ ఫన్ ఫ్యామిలీషో జరుగుతుందని నిర్వాహకులు సునీల్, సాయి లక్కరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఫుడ్‌కోర్టు కూడా ఏర్పాటైందని, కళాభిమానులు కుటుంబసమేతంగా హాజరై కార్యక్రమాన్ని ఆస్వాదించాలని కోరారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

బాపట్ల అర్బన్: బాపట్ల గ్రామ పంచాయతీలోని నందిరాజు తోటలో రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శనివారం బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ, ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎ.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రైతు దేశానికి వెన్నెముక లాంటివాడని, అలాంటి అన్నదాతకు కష్టం వచ్చినప్పుడు తానున్నానని రైతుకి భరోసా కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను అంకితభావంతో ఉద్యోగులు అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పిన్ని బోయిన ప్రసాద్, డైరెక్టర్ మీరాబీ, పశు సంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు, డీఈ రామారావు, ఈవోపీఆర్డీ పులిశరత్ బాబు, మండల వ్యవసాయ అధికారి శారద, అసిస్టెంట్ ఇంజినీర్ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, వడ్డి ముక్కల డేవిడ్, మాజీ చైర్మన్ గవిని కృష్ణ మూర్తి, దివ్యాంగుల సంఘం నేత చల్లా రామయ్య పాల్గొన్నారు.



ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బంగారు తల్లి.. భక్తుల కల్పవల్లి



బంగారు ఆభరణాలను బ్యాంకు నుంచి తీసుకుంటున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

- బండ్లమ్మకు పురాతన బంగారు ఆభరణాల అలంకరణ
- దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసియున్న బగళాముఖి బండ్లమ్మ కొలువులను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండప నిర్మాణంలో లభ్యమైన బంగారు ఆభరణాలను చందోలు ఎస్‌బీఐ శాఖ లాకరు నుంచి అధికారుల సమక్షంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, రమాదేవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. అమ్మవారిని బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించడంతో దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి, టి.శ్రీనివాసరావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, చందోలు ఎస్ఐ రాజశేఖర్ బ్యాంక్ నుంచి బంగారు ఆభరణాలను భద్రతగా దేవాలయానికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లీలా శ్రీనివాసరెడ్డి, కనికిచర్ల ప్రసాద్, భవనంవారి పాలెం మాజీ సర్పంచ్ భవనం భసివిరెడ్డి, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ దోమ నాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు నరసారెడ్డి, బళ్ళారెడ్డి, కుంచల శ్రీనివాసరెడ్డి, చందోలు గ్రామ కార్యదర్శి శేషగిరి రావు పాల్గొన్నారు.



బంగారు ఆభరణాల అలంకరణలో బండ్లమ్మ

బాలల రక్షణకు కమిటీ అవసరం

మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రొటెక్షన్ కమిటీ అవసరమని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.అనూష పేర్కొన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణకై స్ట్రెంత్‌నింగ్ ఆఫ్ కమ్యూనిటీ బేస్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ గ్రామాల్లో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను, బాల్య వివాహాలను, అక్రమ రవాణాను నివారించాలంటే చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అవసరమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లత, కమిటీ అధ్యక్షురాలు పి.గీతా పావని, మహిళా పోలీస్ కార్యదర్శి ఎం.రోజ్‌మేరి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నేలటూరి నాగమణి, బి.అనిల్‌కుమార్, బి.విజయలక్ష్మి, ఎస్.రాధిక, పులివర్తి శేషయ్య, పి.హనీఫ్, బి.అమూల్య పాల్గొన్నారు

బుద్ధుని బోధనలు అనుసరణీయం

మంగళగిరి: బుద్ధుని బోధనలు అనుసరణీయమని ప్రజాకవి, వాగ్గేయకారుడు డాక్టర్ జయరాజు తెలిపారు. నగరంలోని వీటీజేఎం ఐవీటీఆర్ కళాశాల ఆవరణలోని కళావేదికలో శనివారం బుద్ధుని జయంతి వేడుకలు నిర్వహించారు. బుద్ధ మహాత్ముని చిత్ర పటానికి పూలమాలలు వేశారు. జయరాజు మాట్లాడుతూ కుల, మత బేధాలు లేని సమాజాన్ని, సంతోషకర జీవన విధానానికి బౌద్ధం మంచి సూత్రాలను రూపొందించిందన్నారు.

మొక్కజొన్న, జొన్న పంటల పరిశీలన

తెనాలిటౌన్: జగ్గడిగుంటపాలెం, చినరావూరు గ్రామాల పరిధిలోని మొక్కజొన్న, జొన్న పంటలను వ్యవసాయాధికారులు శనివారం పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, జొన్న పంటలు తడిచి దెబ్బతిన్నాయి. పొలాల్లో మొక్కజొన్న కండెలు, జొన్న కంకులు ఉన్నాయి. కొన్ని పొలాల్లో కోసి ఉన్న ఓదెలలో జొన్న కంకులు వర్షాలకు అధిక తేమకు గురికావడంతో మొలక రావడం, గింజలకు బూజు వ్యాపించడం గమనించినట్లు జిల్లా వనరుల కేంద్రం అధికారులు పి.రామాంజనేయులు, జి.ప్రవీణ తెలిపారు. పల్లపు ప్రాంతాల్లో మొక్కజొన్న కండెలు నీట మునిగాయని, అవకాశం ఉన్నంత వరకు ఎండబెట్టుకోవడం వల్ల బూజు తెగులు తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, రాజవంశీ, ప్రసాద్, ఏఈఓ మోహన్, వీఏఏ నీలవేణి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న రామాంజనేయులు, ప్రేమ్‌సాగర్

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె రూరల్: ఐసీడీఎస్ రేపల్లె సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మాణిక్యం తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె పట్టణంలోని 12వ వార్డు వడ్డెర కాలనీ (ఓసీ), 13వ వార్డు ఉప్పూడి రోడ్డు-1 (ఎస్టీ), 23, 26 వార్డుల్లోని ఓల్డ్ బరియల్ గ్రౌండ్ (బీసీ-డీ), 22వ వార్డులో లంబాడి కాలనీ (ఎస్టీ), రేపల్లె మండలం నల్లూరిపాలెం-1 (ఓసీ ఓహెచ్), నల్లూరు నార్త్ (బీసీ-డీ), నగరం మండలం అద్దంకివారి పాలెం (బీసీ-సీ), పెద్దవరం బీసీ ఏరియా (బీసీ-డీ), తాడివాకవారి పాలెం (ఓసీ ఓహెచ్), సిరిపూడి పరిసవారి పాలెం (ఓసీ), శివంగులపాలెం (ఓసీ), కొలగానివారి పాలెం (బీసీ-డీ) తదితర గ్రామాల్లో ఆయా సామాజిక వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. వివాహిత, గ్రామ పరిధిలో నివాసం ఉండాలని ఉండాలన్నారు. 2023 జనవరి 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హత ధృవీకరణ పత్రాల నకళ్లతో ఈ నెల 15లోపు కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పూండ్లలో ఘనంగా లూథరన్ చర్చి ప్రతిష్ట

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో శనివారం ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి ప్రతిష్ట కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. క్రైస్తవ సోదరులు కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవ సందేశాన్ని విన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. యువ పారిశ్రామికవేత్త కాటి విజయకుమార్ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని సంఘస్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత